సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



సీటీ స్కాన్‌కు ప్రైవేటుకే..
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మూడు నెలలుగా సీటీ స్కాన్ యంత్రం పనిచేయడం లేదు.
- 8లో ▸



నిరంతర విద్యుత్ ఇవ్వకుంటే..
వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇవ్వకుంటే ఉద్యమిస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.6 /17.7

వాతావరణం
పొగమంచు కురుస్తుంది. ఉదయం చలిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కొత్త కలెక్టర్‌ను కలిసిన సర్పంచులు



వేల్పూర్: కొత్త కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును వేల్పూర్ మండల సర్పంచులు గురువారం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు ఎడ్ల రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు నితీశ్‌కుమార్, ఏనుగు గంగారెడ్డి, జైడి నాగధర్‌రెడ్డి, కైరి సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

రేపు జిల్లా కోర్టులో లోక్‌అదాలత్

ఖలీల్‌వాడి : జిల్లా కోర్టులో శనివారం లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి సునీత కుంచాలతో పాటు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం గణపతి, రాష్ట్ర బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమం జిల్లా కోర్టులోని న్యాయసేవా సదన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

అందరికీ పరీక్షలు నిర్వహించాలి



వర్ని: ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం వర్ని మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు. ప్రతి వ్యక్తికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, కంటి ఆపరేషన్లు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అద్దాలు అందుబాటులో లేకపోతే ఆర్డర్ చేసి తెప్పించాలని, ఆపరేషన్ అవసరమైన వారిని నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేయాలని సూచించారు. శిబిరాలకు వచ్చే వారికి స్థానిక పంచాయతీ, మండల అధికారులు అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. కంటి వెలుగు శిబిరం నిర్వహణలో ఎక్కడైనా లోపాలు కనిపిస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

వసూల్‌రాజాపై ఆరా..

రంగంలోకి ఇంటెలిజెన్స్ వర్గాలు

నిజామాబాద్ నాగారం : నగరంలోని 44వ డివిజన్ పరిధిలోని ఖలీల్‌వాడిలో ఓ ప్రజాప్రతినిధి వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా 'సాక్షి'లో గురువారం కథనం ప్రచురితం కాగా ఈ విషయంపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీశాయి. సదరు ప్రజాప్రతినిధి వ్యాపారుల వద్ద ప్రతినెలా ఎవరెవరి దగ్గర వసూళ్లకు పాల్పడ్డారనే విషయాలను వారు లోతుగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో నెలకు రూ. 50 వేల వరకు, ఇతర హాస్పిటళ్లు, ల్యాబ్‌లు, మెడికల్, చిరు దుకాణాలకు సంబంధించి నెలవారీ మామూళ్ల గురించి వివరాలను తెలుసుకుని నివేదికను ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ వసూళ్లలో పాలుపంచుకున్న మున్సిపల్ అధికారులు, అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల వివరాలను కూడా సేకరించినట్లు తెలుస్తుంది. గతంలో ట్రేడ్ లైసెన్సుల ద్వారా ఖలీల్‌వాడిలో వచ్చిన ఆదాయ వివరాలు, ప్రస్తుతం వస్తున్న ఆదాయ వివరాలను తీసుకుని ప్రభుత్వానికి పంపుతున్నట్లు సమాచారం. ఈ వసూళ్ల వ్యవహారం నగరంలో హాట్‌టాఫిక్‌గా మారింది. పలువురు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు, అధికారులు ఖలీల్‌వాడి వసూల్ రాజా ఎవరంటూ చర్చించుకుంటున్నట్లు తెలిసింది.

నేడు కామారెడ్డిలో జాబ్ మేళా

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం ఉదయం జాబ్ మేళా నిర్వహించనున్నారు. బహుళజాతి కంపెనీ అయిన జెన్‌పాక్ట్‌లో ఉద్యోగాల భర్తీకి ఈ మేళా నిర్వహిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 2022, 2023 సంవత్సరాల్లో డిగ్రీ, బీటెక్ పూర్తిచేసిన వారు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనాలని సూచించారు.

వన్యప్రాణి విలవిల

ఆహారం కోసం సంచరిస్తూ జనావాస ప్రాంతాల్లోకి వస్తున్న వన్యప్రాణులు తరచూ రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయి. ఇందుకు జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తున్న మనిషే కారణమవుతున్నాడు. అడవులను విచ్చలవిడిగా నరికేయడంతో పాటు గడ్డిజాతి (జింక, దుప్పి) వన్యప్రాణులను వేటాడుతున్నాడు. ఫలితంగా ఆహార కొరత ఏర్పడి చిరుతలు సైతం అవి సంచరించే ప్రాంతాల పరిధి దాటి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నాయి.



రూప్లానాయక్‌తండా వద్ద రోడ్డు దాటుతుండడంతో వాహనం ఢీకొని మృతిచెందిన చిరుత(ఫైల్)

- ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న చిరుతలు
- ఆహారం కోసం తిరిగే క్రమంలో బలవుతున్న వన్యమృగాలు
- జింకలు, దుప్పులను విచ్చలవిడిగా హతమారుస్తున్న వేటగాళ్లు
- శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ పరిధిలో కుక్కల బారిన జింకలు, నెమళ్లు
- దెబ్బతింటున్న జీవవైవిధ్యం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని తెలిసిన మనిషే అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడు. అడవులను విచ్చలవిడిగా నరికేస్తుండడంతో పర్యావరణం పాడైపోతోంది. తద్వారా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. వన్యప్రాణులు భారీగా మృత్యువాత పడుతున్నాయి. జిల్లాలోని వర్ని, కమ్మర్‌పల్లి, ఇందల్వాయి, నిజామాబాద్ నార్త్, నిజామాబాద్ సౌత్, సిరికొండ, ఆర్మూర్ రేంజ్‌ల పరిధిలో మొత్తం 2.14 లక్షల ఎకరాల్లో అటవీ ప్రాంతం ఉంది. ఈ అడవుల్లో పలువురు వేటగాళ్లు ఇష్టం వచ్చినట్లు నాటుతుపాకులతో షికార్లు చేస్తూ జింకలు, దుప్పులు, నీల్గాయిలు, కుందేళ్లను, ఉడుములను, అడవి పందులను హతమారుస్తున్నారు. అడవి జంతువుల మాంసానికి అలవాటుపడిన కొందరు వ్యక్తుల కారణంగా జీవవైవిధ్యం దారుణంగా దెబ్బతింటోంది. ఈ క్రమంలో జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల సంఖ్య తగ్గిపోతుండడంతో వన్యమృగాలైన చిరుతలకు ఆహార కొరత ఏర్పడుతోంది. గడ్డి జాతి (గడ్డి తినే) జంతువులు సరిపడా ఉంటేనే వన్యమృగాల వేటకు ఇబ్బంది ఉండదు. ప్రస్తుతం ఆహారం సమృద్ధిగా లభించని నేపథ్యంలో చిరుతలు అవి సంచరిస్తున్న అటవీ ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అవి జనావాసాల్లోకి సైతం వస్తున్నాయి. చిరుతలు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయి. హైదరాబాద్-నాగపూర్ జాతీయ రహదారికి ఇరువైపులా అడవి ఉండడంతో వాహనాలు నెమ్మదిగా వెళ్లాలని హెచ్చరిక బోర్డులు పెట్టినప్పటికీ ఖాతరు చేయకుండా వేగంగా వెళుతున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనాలు ఢీకొని చిరుతలు మృతి చెందుతుండడం గమనార్హం. అటవీ శాఖ లెక్కల ప్రకారం జిల్లాలో ప్రస్తుతం 28 చిరుతలు ఉన్నాయి.

- తాజాగా ఈ నెల 8న అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి వద్ద చిరుత మృత్యువాత పడింది.
- 2018 మే నెలలో ఇందల్వాయి మండలం రూప్లానాయక్‌తండా వద్ద రోడ్డు దాటుతున్న చిరుత గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందింది.
- 2018 జనవరి 9న ఇందల్వాయి మండలం సిర్నాపల్లి అటవీ ప్రాంతంలో రైలు ఢీకొట్టి చిరుత మరణించింది.
- ఈ నెల 7న నందిపేట మండలం చౌడమ్మ కొండూరు వద్ద కుక్కల దాడిలో జింక మృతి చెందింది.
- ఇదిలా ఉండగా జనవరి 19న సిరికొండ మండలం తూంపల్లి అటవీ ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు నాటుతుపాకులతో వన్యప్రాణుల వేటకు వెళ్లి, వాళ్లలో వాళ్లే గొడవ పడి ఒకరిని హతమార్చడం గమనార్హం.

- నందిపేట మండలంలోని శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతాల్లో అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోడంతో వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. శ్రీరాంసాగర్ నీటిమట్టం తగ్గే ఎండాకాలం సీజన్‌లో గోదావరి పరీవాహక గాదెపల్లి, జీజీ నడ్కుడ, నూత్‌పల్లి, గంగాసరం గ్రా మాల శివారు పంట భూములకు ఆనుకుని ఉన్న గోదావరి పచ్చిక మైదానాల్లో జింకలు, నెమళ్లు, విదేశీ బ్లాక్‌హెడ్, రెడ్ హెడ్ పక్షులు విహరిస్తుంటా యి. ఐదేళ్ల క్రితం ఈ ప్రాంతాల్లో సుమారు 300 వరకు ఉన్న జింకల సంఖ్య ప్రస్తుతం 100 లోపునకు తగ్గినట్లు ఇక్కడి గ్రామాల ప్రజలు చెబుతున్నారు. పంటపొలాల్లో ఆహారం కోసం వచ్చే జింకలను, నెమళ్లను ఊరకుక్కలు వెంటపడి చంపి తింటుడడంతో వీటి సంఖ్య తగ్గిపో తోంది. పొలాలకు సమీపంలో కుక్కలు జింకల ను వేటాడి చంపి తింటున్న దృశ్యాలను గ్రామస్తులు వీడియో తీసి అధికారులకు పంపుతున్నారు. జింకల మాంసానికి అలవాటు పడిన కుక్కలు గుంపులు గుంపులుగా వాటిని వేటాడుతుండడంతో జింకల సంఖ్య తగ్గిపోతోంది. తద్వారా చిరుతలకు సైతం ఆహార కొరత ఏర్పడుతోంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరుత మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిరుత

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి అటవీ ప్రాంతంలో 44వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడేళ్ల వయస్సు గల ఆడ చిరుత మృతి చెందింది. ఎఫ్‌డీవో రామ్‌కిషన్, ఎఫ్ఆర్వో హిమ చందన తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాయన్‌పల్లి అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై చిరుత పడిపోయి ఉండడాన్ని గమనించిన స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లే చూడగా చిరుత మృతి చెందినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు మాట్లాడుతూ చిరుతలు నూతన ఆవాసాల ఏర్పాటు, ఆహారం, నీటి అన్వేషణలో భాగంగా తరచూ తమ ఆవాసాలను వదిలి వేరే ప్రాంతాలకు వెళ్తాయని ఆ క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో కూడా ఈ ప్రాంతంలోనే మగ చిరుత ప్రమాదానికి గురై చనిపోయినట్లు వారు తెలిపారు. మృతిచెందిన చిరుతను తిర్మన్‌పల్లి ఫారెస్ట్ సెంట్రల్ నర్సరీకి తరలించి పశువైద్యుడు గంగాప్రసాద్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి దహనం చేసినట్లు తెలిపారు.

- 2019 జనవరిలో నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం వద్ద పక్షిని ఆహారంగా తీసుకునేందుకు విద్యుత్ స్తంభంపైకి ఎక్కిన చిరుత షాక్‌తో మరణించింది.



స్వచ్ఛ భారత్‌కు మెండోరా పీహెచ్‌సీ

- ఎన్‌ఏక్యూఎస్‌కు ఎంపిక
- ఏటా రూ. 3 లక్షల నిధులు
- గతంలోనే పీహెచ్‌సీని పరిశీలించిన జాతీయ బృందం



మెండోరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

బాల్కొండ : మెండోరా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్వచ్ఛభారత్‌లో భాగంగా ఎన్‌ఏక్యూఎస్ (నేషనల్ ఎస్యూరెన్స్ క్వాలిటీ స్కీం)కు ఎంపికైంది. గతేడాది డిసెంబర్‌లో జాతీయ బృందం ఆస్పత్రిని రెండు దఫాలుగా పరిశీలించింది. ఆస్పత్రిలో నిర్వహిస్తున్న క్లీన్ అండ్ గ్రీన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో మూడేళ్లపాటు ఏడాదికి రూ. 3.9 లక్షలను కేంద్ర ప్రభుత్వం ఆస్పత్రి అభివృద్ధికి మంజూరు చేస్తుందని ఆస్పత్రి వైద్యబృందం పేర్కొంది. దీంతో ఆస్పత్రిలో మౌళిక వసతులు, ఆస్పత్రి సిబ్బంది ప్రోత్సహకానికి ఖర్చు చేసుకునే అవకాశముంటుందని వారు పేర్కొన్నారు. మెండోరా ప్రాథమిక ఆరోగ్యకే కేంద్రాన్ని గతంలోనే ఆస్పత్రి అభివృద్ధి నిధులతో అభివృద్ధి చేశారు. జాతీయ బృందం సభ్యుల పర్యవేక్షణ ఉండటంతో అందంగా తీర్చిదిద్దారు. వైద్య వసతులను మెరుగు పరిస్తే మరింత మందికి వైద్యం అందుతుంది. ఇప్పటికి ప్రతి రోజు 70 నుంచి 100 మంది ఓపీ ఉంటుంది. జాతీయ ప్రమాణాలకు పీహెచ్‌సీ ఎంపిక కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 2023లో మెండోరా పీహెచ్‌సీ మాత్రమే ఉత్తమ పీహెచ్‌సీకి ఎంపికైందని వైద్యులు పేర్కొంటున్నారు.

ఆనందంగా ఉంది

మెండోరా పీహెచ్‌సీ ఎన్‌ఏక్యూఎస్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. మూడేళ్ల పాటు ప్రతి ఏడాది రూ. 3 లక్షల చొప్పున ఆస్పత్రి అభివృద్ధికి నిధులు రానున్నాయి. వైద్య సేవలను మరింత మెరుగు పరుస్తాం.

–చంద్రమోహన్, వైద్యాధికారి

మక్కలకు మంచి ధర



మోర్తాడ్ రైల్వే స్టేషన్ మార్గంలో ఆరబోసిన మక్కలు

- క్వింటాలుకు రూ. 2,100కు పైగా ధర
- యాసంగిలో పెరిగిన సాగు విస్తీర్ణం

మోర్తాడ్(బాల్కొండ) : యాసంగి సీజన్‌కు సంబంధించిన మొక్కజొన్న పంట కోత దశకు చేరుకుంది. రైతులు ఆశించిన విధంగానే మక్కలకు మంచి ధర లభిస్తుండటంతో వారిలో సంతోషం వ్యక్తమవుతోంది. ఎర్రజొన్నలకు ధర ఒప్పందం విషయంలో వ్యాపారులు ముందుకు రాకపోవడంతో అనేక మంది రైతులు ఈ సీజన్‌లో మొక్కజొన్న సాగువైపు మొగ్గుచూపారు. వర్షాకాలంలో అతిగా కురిసిన వర్షాల వల్ల మక్కల దిగుబడి తగ్గిపోయింది. పౌల్ట్రీ పరిశ్రమకు మక్కలు ఎక్కువగా అవసరం కావడంతో యాసంగి సీజన్‌లో మొక్కజొన్న సాగుచేస్తే లాభాలు దక్కించుకోవచ్చని రైతులు ఆశించారు. వర్షాకాలంలో కంటే యాసంగి సీజన్‌లో మక్కల దిగుబడి ఎక్కువగా ఉంటుంది. ఎకరం విస్తీర్ణంలోని పంటకు 40 క్వింటాళ్ల నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి లభిస్తుంది. మక్కలకు తాజాగా క్వింటాలుకు రూ.2,125 ధర పలికింది. మొక్కజొన్న కోతలు అంతటా పూర్తయ్యేసరికి ధర తగ్గినా క్వింటాలుకు రూ. 2 వేలు ఉండే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే మార్కెట్‌లోనే ధర ఎక్కువగా ఉండటంతో మొక్కజొన్న సాగు వల్ల నష్టం ఏమి లేదనే వాదన వినిపిస్తుంది. ఇప్పుడు మక్కలకు తేమ శాతం తక్కువగా ఉండే అవకాశం ఉండటంతో రైతులు వెంటవెంటనే అమ్మేసేందుకు వీలుపడుతుంది. క్వింటాలు మక్కలకు రూ. 2 వేలకు ధర తగ్గకపోతే ఇబ్బంది ఏమి ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

పోలీసుల్లో బదిలీ టెన్షన్!

- మితిమీరిన ప్రజాప్రతినిధుల జోక్యం ?
- తమకు అనుకూలంగా లేకపోతే ట్రాన్స్‌ఫర్లు
- ఎప్పుడు ఎవరు బదిలీ అవుతారో తెలియని పరిస్థితి
- జిల్లాకు పోస్టింగ్‌పై వచ్చేందుకు ఎస్సై, సీఐల విముఖత



ఖలీల్‌వాడి: జిల్లాలో పోలీసులకు బదిలీల టెన్షన్ పట్టుకుంది. ఎప్పుడు ఎవరు బదిలీ అవుతారో తెలియని పరిస్థితి నెలకొంది. నిజామాబాద్ ఏసీపీగా వెంకటేశ్వర్ వచ్చి రెండేళ్లు కాకుండానే బదిలీ కావడం పోలీస్‌వర్గాల్లో చర్చకు దారితీసింది. ఎన్నికల నాటి వరకు ఆయన ఇక్కడే ఉంటారని అందరూ భావించినా ఇంతలోనే బదిలీ కావడంపై చర్చ నడుస్తోంది. అయితే సిఫార్సు లేఖలతో వచ్చినా పూర్తికాలం పోస్టింగ్ ఇచ్చిన చోట ఉంటామా లేదా అనే సందిగ్ధత పోలీసులు ఉన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన ఎస్సైలు, సీఐలు, ఏసీపీల బదిలీలే ఇందుకు నిదర్శనం. పొలిటికల్ లీడర్ల జోక్యంతో జిల్లాలో పోలీసులకు గుర్తింపు లేకుండా పోతోందనే చర్చ కొనసాగుతోంది. తమకు కావాల్సిన వారికి పోస్టింగ్ ఇప్పించుకోవడం, నచ్చని వారిని బదిలీలు చేయిస్తున్నారు. దీంతో జిల్లాకు ఎస్సైలు, సీఐలు రావడానికి జంకుతున్నట్లు తెలుస్తోంది. కొందరు పోలీసులు ఇక్కడ నుంచి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరికొందరు తమకు నచ్చిన ప్రాంతాలకు తమకు సంబంధించిన అధికారుల ద్వారా బదిలీలు చేయించుకున్నారు.

సిఫార్సు లేఖలు ఉంటేనే పోస్టింగ్ ?

జిల్లా పోలీసు శాఖలో ఎస్సై, సీఐ, ఏసీపీ, ఏ ఉన్నతాధికారి పోస్టు అయినా జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖ తప్పనిసరిగా ఉంటేనే పోస్టింగ్ వస్తుందని పోలీసు వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. పోస్టు వచ్చిన తర్వాత ఆ ప్రజాప్రతినిధికి సంబంధించిన పనుల్లో అన్ని తానై వ్యవహరించాల్సిందే. లేకపోతే బదిలీ వేటు తప్పదు. దీంతో పాటు ప్రజాప్రతినిధులు పర్యటనకు వచ్చిన సమయంలో తప్పనిసరిగా వెళ్లి కలిసిరావాల్సి వస్తుంది. లేకపోతే ఆ అధికారి గురించి ప్రజాప్రతినిధులు ఆరా తీస్తారనే చర్చ నడుస్తోంది. పోలీసులు తమ వర్గానికి చెందిన నేతలతో సఖ్యతగా ఉంటారా లేదా.. అలాగే ప్రతిపక్షాలకు సంబంధించిన నేతలతో ఎలా ఉంటారని ఎప్పటికప్పుడు ముఖ్యుల ద్వారా తెలుసుకుంటారని సమాచారం. దీంతో పోలీస్ స్టేషన్లలో కొందరు చోటామోటా లీడర్లు కూడా ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకుంటూ పబ్బం గడుపుకుంటున్నట్లు తెలుస్తోంది. పోలీసులు గత్యంతరం లేక ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎన్నికల కోసం అనుకున్న వారికి పోస్టింగ్

ఎన్నికలకు 10 నెలల వ్యవధి ఉండగానే తమకు అనుకూలంగా ఉన్నవారికి పోస్టింగ్ తెచ్చుకునేందుకు ప్రజాప్రతినిధులు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా బదిలీలు కొనసాగుతున్నాయి. ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత లేకపోవడం, తమకు సహకరించడం లేదనే సాకుతో బదిలీలు చేయించడం పారిపాటిగా మారిందని జిల్లాలో చర్చ నడుస్తోంది. తమకు అనుకూలమైన వారికి పోస్టింగ్‌లు ఇప్పించుకోవడానికి ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్న తరుణంలో ఎంత మందికి బదిలీలు జరుగుతాయోనని చర్చ పోలీసు వర్గాల్లో కొనసాగుతోంది.

వేతన జీవుల వెతలు

- జీతం కోసం ప్రతినెలా ఎదురుచూపులే
- ఏడాది కాలంగా ఇదే దుస్థితి
- జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగులకు తప్పనితిప్పలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలో ప్రతినెలా ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగులకు జీతాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఒకటో తారీఖున రావాల్సిన జీతాలు పదిరోజులు గడిచినా రావడం లేదు. ఏడాది కాలంగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. జీతాలు సకాలంలో రాక రుణాల చెల్లింపులు ఆలస్యమవుతుండడంతో అదనపు వడ్డీ భారం పడుతోంది. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వారి సిబిల్ స్కోర్ దెబ్బతింటోంది. మరోపక్క కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ప్రతినెల 15వ తేదీ తర్వాతే వారి ఖాతాలో జీతాలు పడుతున్నాయి.

వారం దాటినా జమ కాని జీతాలు

రాష్ట్ర ఖజానాను కాసుల కటకట వేధిస్తోంది. ఈ నెల రైతుబంధు పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందించడంతో ఖజానా ఖాళీ అయ్యింది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగులకు జీతాలు రాని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిరోజు కొన్ని జిల్లాల జీతాలను వంతుల వారీగా చెల్లిస్తుంది. ఈరోజు వరకు రాష్ట్రంలో 17 జిల్లాల ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాలు మాత్రమే జమయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో 34,220 ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగులున్నారు. అలాగే 4,010 మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులున్నారు. పది రోజులు గడిచినా జీతాలు రాకపోవడంతో రుణాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. అలాగే ఇంటి అద్దె, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీతాలు రాక ఇంటి అద్దె, పాలు, కేబుల్, కరెంట్ బిల్లులు, ఈఎంఐలు చెల్లించలేకపోతున్నామని వాపోతున్నారు. జీపీఎఫ్, ఎస్ఎల్, టీఎస్‌జీఎల్ఐ, పీఆర్‌సీ ఏరియర్స్, డీఏ ఎరియర్స్ ఏవీ రావడం లేదు. కనీసం జీతాలు కూడా సమయానికి ఇవ్వరా అని ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ-కుబేర్ వచ్చిన తర్వాత ఒకటో తేదీనే జీతాలు జమ అయ్యేవి. ఐఎఫ్ఎంఐఎస్ విధానం వచ్చిన తర్వాత జీతాలు జమకావడంలో ఆలస్యమవుతోంది. రాష్ట్ర ఖజానా శాఖలో అనధికార ఫ్రీజింగ్ వల్ల సకాలంలో జీతాలు రాని పరిస్థితి నెలకొంది.

బిల్లుల చెల్లింపులేవి..

ఓ వైపు వేతనాలు సకాలంలో రాక ఇబ్బందులు పడుతుంటే కొన్ని బిల్లులు ఆగిపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెడికల్ బిల్లులు దాదాపుగా అన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించి గతేడాది బకాయిలు ఇప్పటివరకు అందలేదు. కనీసం రూ. లక్ష లోపు బిల్లులు కూడా రావడం లేదు. టీఎస్‌జీఎల్ఐ వంటి ప్రభుత్వ సంస్థల చెల్లింపులు, రుణాలు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి.

జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాలు	
ప్రభుత్వ ఉపాధ్యాయులు	6,500 మంది
ప్రభుత్వ ఉద్యోగులు	10,560 మంది
విశ్రాంత ఉద్యోగులు	17,160 మంది
కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్	4,610 మంది

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దారుణం

ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. ఇప్పటికే కొన్ని విభాగాలకు 15వ తేదీ తర్వాత వేతనాలు చెల్లిస్తున్నారు. వీరికి ఏజెన్సీల ద్వారా జీతాలిస్తున్నారు. చెక్కులు తయారుచేయడం ప్రతినెలా 5 నుంచి 8వ తేదీల్లో ప్రారంభించడం వల్ల జీతాలు ఆలస్యంగా వస్తున్నాయి. అంతంతమాత్రంగా వస్తున్న జీతాలు సకాలంలో రాక అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

సకాలంలో జీతాలివ్వాలి



సకాలంలో జీతాలు రాక ఉద్యోగులు నానాకష్టాలు పడుతున్నారు. బ్యాంకుల రుణాలు సకాలంలో చెల్లించలేక అదనపు వడ్డీ భారం పడుతోంది. ప్రభుత్వం స్పందించి ఇక నుంచైనా ప్రతినెలా మొదటి తారీఖునే జీతాలు చెల్లించాలి.

– కృష్ణారెడ్డి, పీఆర్‌టీయూ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్

ఫైన్‌లు కట్టాల్సి వస్తోంది



ప్రభుత్వం జీతాలు సకాలంలో ఇవ్వకపోవడంతో బ్యాంకుల్లో ఈఎంఐలు చెల్లించడంలో ఆలస్యమవుతున్నాయి.దీంతో ఫైన్‌లు కట్టాల్సి వస్తోంది. అలాగే ప్రతినెలా ఇంటి అద్దె, పాలు, కరెంట్ బిల్లులు చెల్లించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– రాథోడ్ దయాసింగ్, పీఆర్‌టీయూ నాయకుడు

క్లుప్తంగా

కోటగిరి 'సాక్షి' విలేకరి మృతి


గంగాధర్‌(ఫైల్‌)

వర్ని: సీనియర్‌ పాత్రికేయుడు, కోటగిరి మండల 'సాక్షి' పార్ట్‌టైం విలేకరి గంగాధర్‌(52) గురువారం ఉదయం తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన 30 ఏళ్లుగా వివిధ పత్రికల్లో పనిచేశారు. గంగాధర్‌ మృతిపై జర్నలిస్టు సంఘాలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్‌ భాస్కర్‌ రెడ్డి, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు సురేందర్‌రెడ్డి, బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి మాల్యాద్రి రెడ్డి, కాంగ్రెస్‌ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాలరాజు, రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎలమంచిలి శ్రీనివాసరావు, యూత్‌ కాంగ్రెస్‌ మాజీ రాష్ట్ర కార్యదర్శి కూనిపూర్‌ రాజిరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నేసాబ్‌లు సంతాపం తెలిపారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



మాక్లూర్‌: జాతీయ స్థాయి పరుగు పందెం పోటీలకు మండలంలోని కేజీబీవీకి చెందిన విద్యార్థి జి నిఖిత ఎంపికైనట్టు పాఠశాల ప్రత్యేక అధికారిణి ప్రగతి గురువారం తెలిపారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో నిఖిత పాల్గొననున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

సీఆర్పీఎఫ్‌ జవాన్‌ విగ్రహం ధ్వంసం

తాడ్వాయి: మండలంలోని చిట్యాలలో ఏర్పాటు చేసిన సీఆర్పీఎఫ్‌ జవాన్‌ కంది సిద్దిరాములు విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన సిద్దిరాములు 1997లో విధి నిర్వహణలో అసోంలో మృతి చెందాడు. సిద్దిరాముల తల్లి నాగవ్వ తన పింఛన్‌ డబ్బులను పోగు చేసుకొని విగ్రహాన్ని తయారు చేయించింది. గ్రామస్తుల సహకారంతో ప్రధానకూడలీ గద్దెపై విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల అనంతరం విగ్రహ ఆవిష్కరణ చేపట్టాలని నిర్ణయించారు. ఇంతలో గ్రామానికి చెందిన కొందరు ఈ విగ్రహాన్ని గద్దె నుంచి కింద పడేశారు. సిద్దిరాములు తమ్ముడు కంది విఠల్‌ పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయగా పోలీసులు మేడం బాలయ్య, సంగెం మురళి, లాండే రమేష్‌, ఏటి మల్లేష్‌ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు గుర్తించారు.

వెబ్‌సైట్‌లో పట్టుబడ్డ వాహనాల వివరాలు

ఖలీల్‌వాడి: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం వేస్తామని సీపీ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలకు సంబంధించిన వివరాలను నిజామాబాద్‌ పోలీస్‌ కమీషనరేట్‌కు చెందిన ట్విట్టర్‌, ఫేస్‌ బుక్‌ లో గురువారం పొందిపర్చినట్లు పేర్కొన్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న 226 వాహనాలు కమిషనరేట్‌లోని పోలీస్‌ లైన్‌లో ఉన్నాయని చెప్పారు. యాజమానులు పత్రాలను తీసుకువచ్చి వారి వాహనాలు తీసుకెళ్లాలని సూచించారు. వివరాలకు www.nizamabadpolice.in, https://twitter.com/cp&nizamabad, https://www.facebook.com/cpnizamabad, రిజర్వు విభాగం (అడ్మిన్‌) అధికారి అనిల్‌ కుమార్‌ (8712659701) సంప్రదించాలని కోరారు.

సీటీ స్కాన్‌కు ప్రైవేటుకే..

- జీజీహెచ్‌లో మూడు నెలలుగా పనిచేయని యంత్రం
- బయట సెంటర్లకు పంపుతున్న సిబ్బంది
- రోగులపై ఆర్థికభారం


పని చేయని స్కానింగ్‌ మిషన్‌



మిషన్‌ పనిచేయటం లేదని పెట్టిన బోర్డు

నిజామాబాద్‌ సిటీ: జిల్లా కేంద్రం ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి(జీజీహెచ్‌)లో అతి ముఖ్యమైన సిటీ స్కానింగ్‌ మిషన్‌ మూడు నెలలుగా పనిచేయటం లేదు. కొట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వం కొనుగోలు చేసిన స్కానింగ్‌ మిషన్‌ పనిచేయకపోవటంతో స్కానింగ్‌కు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. జిల్లాతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజల వైద్యానికి జీజీహెచ్‌ పెద్దదిక్కుగా ఉంది. మిషన్‌ పనిచేయకపోవటంతో రోగులు ప్రయివేట్‌ స్కానింగ్‌ సెంటర్లలో స్కానింగ్‌ తీయించుకుంటున్నారు. జిల్లాలోనే అతిపెద్దదైన ఆస్పత్రిలో స్కానింగ్‌ మిషన్‌ చెడిపోతే వెంటనే మరమ్మతులు చేయించాల్సిన అధికారులు దీనిగురించి పట్టించుకోవటంలేదు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌ ప్రతిమారాజ్‌ స్కానింగ్‌ మిషన్‌ విషయంలో నవంబర్‌ నెల నుంచి సంబంధిత పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికి ఫలితం లేకుండా పోతోంది. దాంతో న్యూరోకు సంబంధించి రోగులు స్కానింగ్‌ కొరకు ప్రయివేట్‌ స్కానింగ్‌ సెంటర్లకు వెళ్లి పరీక్షలు చేయించుకోవల్సి వస్తోంది.

మెయింటెనెన్స్‌ చార్జీల బకాయిలు

ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సిమాన్స్‌ కంపనీకి చెందిన స్కానింగ్‌ మిషన్‌ నిర్వహణకు ప్రతి నెలా మెయింటెనెన్స్‌ చార్జీల కింద ప్రభుత్వం దాదాపు రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉంటుంది. స్కానింగ్‌ మిషన్‌ నిర్వహణ, మరమ్మతుల బకాయిలు రూ.1.27కోట్లు ఉన్నాయి. ఈ బకాయి డబ్బులు చెల్లిస్తేగాని ఆ కంపెనీ వారు మిషన్‌ను బాగుచేసే పరిస్థితి లేదు. ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రిలో ముఖ్యమైన ఆపరేషన్లు విజయవంతం కావటంతో ప్రజలకు ప్రభుత్వ వైద్యులపై నమ్మకం కలుగుతోంది. దాంతో రోజు రోజుకు రోగుల సంఖ్య పెరుగుతోంది. సీటీ స్కానింగ్‌ మిషన్‌కు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని రోగులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ప్రభుత్వ ఆస్పత్రిలో గల స్కానింగ్‌ మిషన్‌ తరచు పాడవుతోంది. దీని స్థానంలో కొత్త స్కానింగ్‌ మిషన్‌ పంపాలని నవంబర్‌ నుంచి వైద్యశాఖకు లేఖలు రాస్తున్నాం. మూడు నెలాల తర్వాత ఈ విషయం కొలిక్కి వచ్చింది. కొత్త మిషన్‌ ఇచ్చేందుకు అధికారులు అంగీకారం తెలిపారు. మరో రెండు నెలాల్లో ఆస్పత్రికి కొత్త స్కానింగ్‌ మిషన్‌ రాబోతుంది.

– ప్రతిమారాజ్‌, ఆస్పత్రి సూపరింటెండెంట్‌

నిరంతర విద్యుత్‌ ఇవ్వకుంటే ఉద్యమిస్తాం




మాట్లాడుతున్న బీజేపీ నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం: వ్యవసాయానికి 24 గంటల కరెంట్‌ ఇవ్వకుంటే ఉద్యమిస్తామని బీజేపీ నేత వడ్డీ మోహన్‌ రెడ్డి అన్నారు. గురువారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ప్రతి రోజూ కరెంట్‌ ఎప్పుడొస్తుందో పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని.. వచ్చే ఐదు రోజుల్లోగా స్పందించి నిరంతర విద్యుత్‌ ఇవ్వకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని శ్రీరాంసాగర్‌, నిజాంసాగర్‌ ప్రాజెక్టుల్లో నీళ్లు ఉండడంతో రైతులు యాసంగిలో పెద్ద ఎత్తున వరి పంట సాగుచేసుకున్నారని, బోరుబావిల వద్ద కూడా పంటలు వేశారని తెలిపారు. కరెంటు కోతలతో కాలువల ద్వారా నీరందని పొలాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం కరెంట్‌ వచ్చే సమయం చెప్పాలని రైతులు అధికారులను అడిగితే తెల్లముఖం వేస్తున్నారన్నారు. అలీసాగర్‌, గుత్ప ఎత్తిపోతలకు సైతం సక్రమంగా కరెంట్‌ రావడం లేదన్నారు. ఈ కరెంట్‌ సమస్యపై తక్షణమే మంత్రి, ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ మధ్య నీటి సమస్య ఉండగా నాందెడ్‌ సభలో సీఎం కేసీఆర్‌ బాబ్లీ నుంచి రివర్స్‌ పంపింగ్‌ చేసి నీళ్లి ఇస్తామని చెప్పడంపై మండిపడ్డారు. ధరణి సమస్యలు పరిష్కరించాలని, అలాగే రైతులకు రూ. లక్ష రుణమాఫీ చేయాల్సిందేనన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చండి

ఇటీవల జిల్లాకు వచ్చిన మంత్రి కేటీఆర్‌ కేంద్రం ఏమీ ఇస్తలేదని అనడం సరికాదన్నారు. ఉచితంగా బియ్యం ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి 5 కిలోల బియ్యం ఇస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క కిలో కూడా ఇవ్వడం లేదన్నారు. ఉపాధిహామీ ద్వారా ప్రతి గ్రామంలో కుటుంబానికి 100 రోజుల పని కల్పిస్తున్నామని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే షుగర్‌ ఫ్యాక్టరీ తెరిపిస్తామన్నారు. మాజీ సర్పంచ్‌ రచ్చ సుదర్శన్‌, ఎడపల్లి మండల అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, నాయకులు నర్సింగ్‌, నారాయణ పాల్గొన్నారు.

చిలుకలు వాలే చెట్టయ్యింది



కామారెడ్డి రైల్వే స్టేషన్‌ ఎదుట ఉన్న వేప చెట్టు రాత్రి కాగానే రామచిలుకలతో కనువిందు చేస్తుంది. చాలా ఏళ్లుగా ఈ వేప చెట్టుపై వేలాది సంఖ్యలో రామచిలుకలు ఉంటున్నాయి. రాత్రి వేళ ఈ రామచిలుకలు ఎగరడం, మళ్లీ చెట్టుపై వాలడం, కొమ్మ కొమ్మకు ఆకుల్లాగా కనిపిస్తున్నాయి.

- కామారెడ్డి టౌన్‌

'కాంగ్రెస్‌లో చేయి కలిపేవారు లేరు'



కామారెడ్డిటౌన్‌: కాంగ్రెస్‌ పార్టీలో చేయి చేయి కలిపేవారు లేరని ఇటీవల వైఎస్సార్‌ తెలంగాణ పార్టీలో చేరిన జమునారాథోడ్‌ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసే వారికి, అందులో మహిళలకు గుర్తింపు లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలు, పెత్తనాలు కొనసాగుతున్నాయన్నారు. కాంగ్రెస్‌ జీరో స్థాయిలో ఉన్న సమయంలో వైఎస్‌ రాజశేఖరరెడ్డి పాదయాత్రతో జీవం పోశారని ఆయన ఆశయాల కోసం వైఎస్సార్‌టీపీలో చేరానని చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియామకం అయ్యాక ఎవరిని లెక్కలోకి తీసుకోవడం లేదన్నారు. 14 ఏళ్లుగా కాంగ్రెస్‌లో తనను ఎంతగా అవమానించినా ఓపిక పట్టానని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో వైఎస్సార్‌ టీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. నాయకులు నీలం రమేష్‌, నీలం సుధాకర్‌, మహ్మద్‌ తాహెర్‌, డాక్టర్‌ వెంకట్‌ ఉన్నారు.

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ విజయం ఖాయం


ధర్మారం(బి)లో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, నగేష్‌రెడ్డి

డిచ్‌పల్లి: రాబోయే ఎన్నికల్లో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్‌ విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్‌ భూపతిరెడ్డి, టీపీసీసీ ప్రధానకార్యదర్శి కే నగేష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హాత్‌ సే హాత్‌ జోడో కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో పాదయాత్ర చేశారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌గాంధీ సందేశాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. 24 గంటల నిరంతర విద్యుత్‌ సరఫరా చేస్తున్నామని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, క్షేత్ర స్థాయిలో 6 గంటలు కూడా విద్యుత్‌ రావడం లేదన్నారు. పంటలు ఎండిపోతున్నాయని రైతులు నిరసనలు చేస్తుంటే కళ్లు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. 8 ఏళ్లలో రూరల్‌ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. ముప్ప గంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అమృతాపూర్‌ గంగాధర్‌, పాలసాని శ్రీనివాస్‌, వాసుబాబు, శ్యాంసన్‌, ధర్మాగౌడ్‌, మురళి, రాజేశ్వర్‌, ఇబ్రహీం, సాయారెడ్డి, మల్కయ్య పాల్గొన్నారు.

అప్పు తీర్చడంలో సహకరించలేదని..

- భార్యతో కలిసి తల్లిని హత్య చేసిన కొడుకు


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి: అప్పులు తీర్చడంలో సహకరించడం లేదని కొడుకు, కోడలు కలిసి మహిళను హతమార్చినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఎల్లారెడ్డి పోలీస్‌ స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని గండిమాసానిపేట గ్రామానికి చెందిన లచ్చి సంజీవులు కూలీ పనులు చేసుకుంటు జీవనం గడిపేవాడు. చేసిన అప్పులు తీర్చేందుకు పొలం అమ్మాలని తల్లి లచ్చి పోచవ్వ (57)ను కోరగా ఆమె నిరాకరించింది. ఈ విషయమై 7న రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో తల్లి హతమార్చాలని నిర్ణయించుకుని 8వ తేది వేకువ జామున భార్య సరితతో కలిసి పోచవ్వ మెడకు టవల్‌తో చుట్టి చంపేశాడు. గురువారం గ్రామ శివారులో సంచరిస్తున్న సంజీవులును పట్టుకుని విచారించగా తన భార్య సరితతో కలిసి తల్లిని హతమార్చానని ఒప్పుకున్నాడని డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌, ఎస్సై గణేష్‌ ఉన్నారు.

క్రైం కార్నర్‌

అనుమానంతో భార్యను చంపిన భర్త


సవిత మృతదేహం

నిజామాబాద్‌ సిటీ: అనుమానంతో కట్టుకున్న భార్యను అంతమొందించాడు ఓ భర్త. ఈ ఘటన నిజామాబాద్‌ రూరల్‌ మండలం భాగ్యనగర్‌(ఖానాపూర్‌)లో చోటు చేసుకుంది. రూరల్‌ సీఐ నరేష్‌ తెలిపిన వివరాలు.. భాగ్యనగర్‌కు చెందిన మారుతి నిజామాబాద్‌ గంజ్‌లో హమాలీ పని చేస్తుంటాడు. ఇతని భార్య గెలాండే సవిత(38) ఇంట్లోనే ఉంటూ అప్పుడప్పుడు కూలీ పనికి వెళ్తుంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు కాగా పెద్ద కూతురికి వివాహం చేశారు. కాగా మారుతి పనికి సక్రమంగా వెళ్లకుండా మద్యానికి డబ్బుల కోసం భార్యను వేధిస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో భార్యపై అనుమానం పెంచుకుని వేధించేవాడు. గురువారం మధ్యాహ్నం ఈ విషయంలో భార్యను అనుమానిస్తూ ఆమెపై దాడి చేసి గొంతు నులిమి చంపాడు. అనంతరం అక్కడి నుంచి జారుకున్నాడు. అనంతరం సవిత ఇంటికి వచ్చిన బంధువు గమనించి చుట్టుపక్కల వారికి విషయం తెలిపింది. అనంతరం స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలుపగా సీఐ నరేష్‌, ఎస్సై లింబాద్రి ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతురాలి తండ్రి లక్ష్మణ్‌ బాబురావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎడపల్లి: మండలంలోని జానకంపేట గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. సదరు మహిళకు మతిస్థిమితం లేదు. కొన్ని రోజులుగా గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో గురువారం రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు లారీ కింద పడింది. లారీ చక్రాలు ఆమె మీద నుంచి వెళ్లడంతో ఘటన స్థలంలోనే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు..


రాజు (ఫైల్‌)

ఎడపల్లి: మండలంలోని జానకంపేట సమీపంలో అశోక్‌సాగర్‌ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎంఎస్‌సి ఫారం గ్రామానికి చెందిన అన్నారం రాజు(30) గురువారం మృతి చెందాడు. అన్నారం రాజు కారును ఓవర్‌టెక్‌ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించాడు.

'స్పౌజ్‌ పాయింట్లు వాడిన వారి వివరాలు బయటపెట్టాలి'

నిజామాబాద్‌ అర్బన్‌: ఉపాధ్యాయ బదిలీల్లో స్పౌజ్‌ పాయింట్లు వాడుకున్న టీచర్ల వివరాలను బయట పెట్టాలని టీపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు వెనిగర్ల సురేష్‌ ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. గతంలో పాయింట్లు వాడుకొని ప్రస్తుతం కూడా కొందరు మళ్లీ వినియోగించుకున్నారని ఈ వివరాలు బయట పెట్టాలన్నారు. 2017, 2018లో స్పౌజ్‌ పాయింట్లు వాడుకున్న ఉపాధ్యాయులను పరిశీలించాలన్నారు. గతంలో స్పౌజ్‌ పాయింట్‌ వినియోగించుకొని సర్వీస్‌ బుక్కులో స్టాంపు వేయలేదన్నారు. దీంతో అవే పాయింట్లు వాడుకుంటున్నారన్నారు. పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని డిమాండ్‌ చేశారు.

క్రీడా దుస్తుల ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌ క్యాంపస్‌(భిక్కనూర్‌)కు చెందిన క్రీడాకారులు రూపొందించిన దుస్తులను గురువారం వీసీ రవీందర్‌ ఆవిష్కరించారు. సౌత్‌క్యాంపస్‌లో వివిధ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులందరూ ఒకే విధమైన డ్రెస్‌కోడ్‌ పాటించాలని ఈ దుస్తులు రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ స్పోర్ట్స్‌ అండ్‌ గేమ్స్‌ డైరెక్టర్‌ టి.సంపత్‌, సౌత్‌క్యాంపస్‌ స్పోర్ట్స్‌ ఇన్‌చార్జి సుధాకర్‌గౌడ్‌, పీడీ బీఆర్‌నేత, అసిస్టెంట్‌ పీడీ శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

దొంగ కోసం పోలీసుల గాలింపు

- కార్మికుల బంధువుగా అనుమానం?
- నాలుగు గంటల పాటు బ్యాంక్‌లోనే..


సీసీ ఫుటేజీలో నమోదైన నిందితుడు

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ రూరల్‌ మండలం ఖానాపూర్‌ గ్రామంలో మూడు రోజుల క్రితం జరిగిన బ్యాంక్‌ చోరీ యత్నం కేసులో దొంగ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. బ్యాంక్‌లో చోరీ యత్నానికి పాల్పడిన దొంగ ఖానాపూర్‌ పరిసరాల ప్రాంతాలలో రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న హమాలీల ఇంటికి వచ్చిన బంధువుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు హమాలీలను విచారించే పనిలో ఉన్నారు. కాగా బ్యాంక్‌లో చోరీకి యత్నించిన దొంగ ఆ రోజు రాత్రి 11 గంటల ప్రాంతంలోనే కిటికీ ఇనుప చువ్వను తొలగించి బ్యాంక్‌లోకి చొరబడినట్లు పోలీసులు సీసీ ఫుటేజీలో గమనించారు. 11 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు బ్యాంక్‌లోనే ఉన్నాడు. మొదట ఏటీఎం ధ్వంసం చే సి అందులో డబ్బులు దొంగలించేందుకు యత్నించి విఫలమయ్యాడు. అనంతరం లాకర్‌ గది వద్దకు వచ్చాడు. లాకర్‌ గది ఇనుప డోర్‌ కంటే ముందు కట్టెతో తయారు చేసిన తలుపును పగలగొట్టాడు. అనంతరం లాకర్‌ డోర్‌ను తెరిచేందుకు యత్నించి విఫలమయ్యాడు. దీంతో పారిపోయాడు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

నవీపేట: మండల కేంద్రంలోని రైల్వేగేట్‌ సమీపంలో బుధవారం రాత్రి రైలు కింద పడి ఒకరు ఆత్మహ త్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ మహబూ బ్‌ తెలిపారు. నవీపేటకు చెందిన నర్సింహాచారి (53) ఆర్థిక ఇబ్బందులతో నర్సాపూర్‌ నుంచి నాగర్సోల్‌కు వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్యకు పా ల్పడినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు

సదాశివనగర్‌: మండలంలోని పద్మాజీవాడి శివారు అటవీ ప్రాంతంలో గత జూలైలో కామారెడ్డి పట్టణానికి చెందిన విభూతి సుభద్ర అనే వృద్ధురాలిపై దాడి చేసిన వారికి జైలు శిక్ష విధించింది. నిజామాబాద్‌కు చెందిన నీరడి అరుణ్‌కుమార్‌, కొండపల్లి సావిత్రి కలిసి కామారెడ్డిలో సుభద్రను బైక్‌పై ఎక్కించుకుని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి ఒంటిపై ఉన్న రూ.మూడు లక్షల విలువైన బంగారు ఆభరణాలు దొంగిలించారు. ఈ విషయంలో అప్పట్లో వారిపై కేసు నమోదు అయింది. నిందితులకు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్‌ దుర్వా గురువారం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష రూ.500 జరిమానా విధించినట్లు ఎస్సై రాజేశ్‌ తెలిపారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ అశోక్‌ శివరాం నాయక్‌, సీఐ రామన్‌, ఎస్సై రాజేశ్‌ ఈ కేసుపై ప్రత్యేక దృష్టి పెట్టినందుకు ఎస్పీ వారిని అభినందించారు.

డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో జైలు

భిక్కనూరు: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ఎస్సై ఆనంద్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం మెదక్‌ జిల్లా లక్ష్మాపూర్‌కు చెందిన ఇరుకుల పోచయ్య మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. ఆయనను కామారెడ్డి సెకండ్‌క్లాస్‌ మేజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపరచగా రెండు రోజుల జైలు శిక్ష విధించారన్నారు.

బోధన్‌లో యువకుడు మృత్యువాత

బోధన్‌టౌన్‌: పట్టణంలోని కొత్త బస్టాండ్‌ సమీపంలోని బాలజీ స్వీట్‌హోంపై భవనంలో శక్కర్‌నగర్‌ కాలనీకి చెందిన షేక్‌ సల్మాన్‌(30) మృతి చెందాడు. బాలజీ స్వీట్‌హోం భవనంపై మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని శక్కర్‌నగర్‌ నివాసిగా గుర్తించి, హైదరాబాద్‌లో ఉంటున్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సల్మాన్‌ మద్యం తాగి తిరిగేవాడని స్థానికులు తెలిపారు. బుధవారం రాత్రి మద్యం తాగి ఈ ప్రాంతంలోనే తిరిగాడని, మద్యం మత్తులో కిందపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ విషయమై సీఐ బీడీ ప్రేమ్‌కుమార్‌ను సంప్రదించగా తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కంటెయినర్‌

- ఒకరి మృతి, మరో ఇద్దరికి గాయాలు

సదాశివనగర్‌: మండలంలోని దగ్గి అటవీ శివారు జాతీయ రహదారిపై బుధవారం ట్రాక్టర్‌ను కంటెయినర్‌ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజేశ్‌ తెలిపారు. ఇందల్‌వాయి టోల్‌ప్లాజకు చెందిన కూలీలు ధర్పల్లి కిషన్‌(53), గణపురం భూమయ్య, బాదావత్‌ రవీందర్‌ పనులు ముగించుకొని ట్రాక్టర్‌లో ఇందల్‌వాయి వైపు వెళ్తున్నారు. అదే స మయంలో నిజామాబాద్‌ వైపు వెళ్తున్న కంటెయినర్‌ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కూలీలను నిజామాబాద్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ధర్పల్లి కిషన్‌ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. గణపురం భూమయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కిషన్‌ భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కిషన్‌ టోల్‌ ప్లాజలో ఐదేళ్ల నుంచి చేస్తున్నాడని పేర్కొన్నారు. కంటైనర్‌ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చెరువులో ఒకరి గల్లంతు!

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లి గ్రామానికి చెందిన నల్లవెల్లి మహిపాల్‌ గ్రామ శివారులోని చెరువు లో గల్లంతైనట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం గ్రామంలోని ఒకరి ఇంట్లో శుభకార్యం జరిగింది. వారి బట్టలు ఉతికేందుకు మహిపాల్‌ తన భార్య, తల్లితో కలిసి చెరువు వద్దకు వెళ్లాడు. భార్య, తల్లి బట్టలు ఉతుకుతుండగా అప్పటికే కల్లు తాగిన మహిపాల్‌ స్నానం చేయడానికి చెరువులో దిగాడు. చెరువు నుంచి మహిపాల్‌ బయటకు రాకపోవడంతో భార్య, తల్లి ఆందోళనకు గురై గ్రామస్తులకు, పోలీసులకు తెలియడంతో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడినా మహిపాల్‌ ఆచూకీ లభించకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు.